# SATYA BHAJANA

# సత్య భజన

## అక్షరమాలికా కందాలంకారములు

(1874).

(1902లో సి.ఎల్.ఎస్. వారు ముద్రించినది.)

(కందపద్యములును కీర్తనలును)

పటాలపు సంఘ క్రైస్తవుల కొరకు 1874లో రచించినది.

కం॥ ఆవనియు నాకాశంబును
రవిశశితారాగణములు - రాత్రి దివసముల్
ఎవని మహాత్మావచనో
ద్భవమయ్యెను నా త్రియేక - దైవము గొలుతున్

## 1. కీర్తన

**రా–శంకరాభరణము** **తా అట**

దైవంబు గొలుతున్ - నా తండ్రి యె - హెూవాను దలతున్ = ఏ విభుం డీవిశ్వ - మెల్ల నిజోక్తిచే । గావించి దీవించి - కాపాడుననిశంబు ॥ దైవంబు గొలుతున్ ॥

1. ఇనచంద్రతారల్ - భువి దివియందు - గనుపడెడి మెరుగుల్ । ఎవ్వని తేజ - మున వెల్గిమేరల్ । దప్పగలేక - దినములు రాత్రుల్ = ఒనరంగ తమతమ - పనిచేయుచుండు నె । వ్వని యాజ్ఞచే జగము -లను వర్తించును అట్టి ॥ దైవంబు గొలుతున్ ॥

కం॥ ఆదమువలనను వచ్చెను
హా దుర్గతి పుడమినరుల - కదివోగొట్టన్
మోదమున నవతరించితి
వోదేవ తవాంఘ్రి దాస్య-మొసగవె మాకున్

## 2. కీర్తన

"యెూహెూవ నా మెుర"వలె.

రా—ఆనందభైరవి తా—ఆది

తవాంఘ్రి దాస్యము నొసంగవే - భ - క్తవత్సలా మమ్ముగావవే = భవాంబునిధి విష - యవీచికలు పొర । లివచ్చెనవి యణ - పవే ప్రభో ॥ తవాంఘ్రీ దాస్యము ॥

1. మనుష్యులకు బొదివె పాపము - యా - దినరుడు దీనికి సమూలము = అనూన దురితము - లణంచుటకు యే । సునాధనీవవ -ని నవరించితి ॥ తవాంఘ్రి దాస్యము ॥

కం॥ ఇమ్మానుయేలు నరరూ
పమ్మున యవతారమూని - పాపాత్ముల రా
రమ్మని బిలచుచు వారి య
ఘమ్ములు హరియించి బ్రోచు - కరుణానిధియై.

## 3. కీర్తన

రా - శంకరాభరణము తా- అట

కరుణానిధియై - క్రీస్తుడువచ్చె - ధరణికి నరుడై = నరజాతి దురవస్థ - దరిశించి తత్పాప । పరిహారము కొరకై య -ర్పణసేయ దేహము ॥ కరుణానిధియై॥

1. నరులందు నరుడై - దేవునియందు - పరమేశ్వరుడై । ఇమ్మానుయేల్ వరనామధరుడై । పాపులఁబ్రోవ - కరుణా తత్పరుడై = నిరయ వహ్నికి బోవు - నరులార ననునమ్మ । త్వరగా రండని బిల్చె - దరిజేర్చి రక్షింప ॥ కరుణానిధియై॥

కం॥ ఈతడు దేవుని యాత్మజు
డీతడు మరియాతనూజు - డిది నిజమనియే
చేతనుడు నమ్మునాతని
పాతకములు దొలగి గలుగు - పరమసుఖంబుల్

## 4. కీర్తన

"ఆనందమగు ముక్తి"వలె

రా-సురటి తా -అట

పరమ సుఖముగోరు-బలుధీమంతునికి =ఎరుక కలిగియుండు - యేసుని యునికి ॥ పరమ సుఖము ॥

1. దేవుని ప్రియుండద్వి - తీయాత్మజుండు । భావింప మరియా గ-ర్భస్థుడై నాడు । కేవలమానవా - కృతి దాల్చినాడు = ఆవంతైనను పాప - మంటనివాడు ॥ పరమ సుఖము ॥

2. నరదైవత్వములందు సరిగానున్నట్టి ।గురుతులు మదిలో గ-న్గొని నమ్మినట్టి । నరులెవ్వరో వారి - దురితముల్ బట్టి = పరిహరించును క్రీస్తు -పదమాత్మబెట్టి ॥ పరమ సుఖము॥

కం॥ ఉన్నతముల కున్నతమై
చెన్నగ దయలీను ముక్తి - సింహాసనమం
దున్న ప్రభు యేసుక్రీస్తుని
సన్నుతి సేయుదము రారె - సజ్జనులారా.

## 5. కీర్తన

"అయ్యో మానవులారా"వలె

రా–అసావేరి తా–అట

రారె సజ్జనులారా – క్రీస్తుని వేడ –రారె సోదరులారా = సారాంశమెదలో వి–చారించునపుడెంతో । ఘోరమై మన పాప – భారముల్గనుపించు = భూరికారుణ్యమన దేవకు – మారుడవతారము ధరించి శ । రీర రుధిరముచేత మన వి–స్తార దురితము లెల్ల దునిమెను ॥ రారె సజ్జనులారా ॥

1. కన్నులు గనజాలని – గగనమణి –కన్న మిక్కిలి కాంతిని = ఉన్నతములకు స–మున్నతమై వెల్గు । చున్న సింహాసనమం–దొప్పుగా గూర్చుండి = తిన్ననగు సద్భక్త జనముల –కున్న యాపదలన్ని బాపి ప్ర । సన్నవదనము జూపు క్రీస్తుని –సన్నుతల్ గానములు జేతుము ॥ రారె సజ్జనులారా ॥

కం॥ ఊపిరి పోయిన పీనుగు
తోపోలని ప్రతిమలకు ను –తుల్ జేతురయో
కాపురుషులు వారల దుర్
వ్యాపారము మాన్పియాత్మ – వరము లొసగవే.

## 6. కీర్తన

రా–శంకరాభరణము తా–అట

వరములొసగవే –పాపులకాత్మ –దర్శనమీవే = నిరయ కూపములోనికురికి పోవుటకాత్మ । నరవాయిగొనని దు–ర్నరుల రక్షింపను ॥వరము॥

1. పీనుంగుతోను –సరిసేయంగ – రానిబొమ్మలను।సంస్థాపించి – నానావిధములను ।పూజించున –జ్ఞానజీవులను = నీ నామ మెరిగించి – నిజభక్తి నాటించి । యానిత్యజీవమున – కాకర్షింపవె తండ్రి ॥వరము॥

కం॥ ఋతమును మార్గంబును శా
శ్వతజీవము నేననెడి బ -వద్దివ్యదయా
మృతవచనము మతిలోనిడు
ప్రతి క్రైస్తవుదాత్మ సుఖము - బడయక యున్నే

## 7. కీర్తన

రా - యదుకులకాంభోజి తా-అట

ఆత్మసుఖము బడయకున్న - యతడు భక్తుడే - నిర్మ - లాత్మమేళనంబు లేని-యతడు ముక్తుడే =సాత్విక ప్రశాంతసుగుణ -సాగరుండు క్రీస్తుడతని । తత్వమెరిగి తన్నురోసి - తత్పదాంబుజములు నమ్మి ॥యాత్మసుఖము ॥

1. దారి నిజము జీవనంబు - దానెయనుచును యమృత -సార వాక్యమిచ్చె ప్రభువు -సాదులలరను = పారమార్థికముగపల్కు - చారు వచనమెదను నమ్మి । భారమతని పైనిబెట్టు - దారి తప్పకుండనట్టి ॥యాత్మసుఖము॥

కం॥ ఎక్కడనిద్దరు ముగ్గరు
చక్కగ నాపేరనున్న -సదయుడనై నే
నక్కడనుండెద నంటివి
నిక్కముగా మమ్ముజూడ -నేడిటరావే

## 8. కీర్తన

"రారె గొల్లవారలారా"వలె

రా-ఆనందభైరవి తా-అట

మమ్ముజూడ నేడు రావే - మంచి - నెమ్మదియ్య కృపనుదేవే = ఇమ్మాను యేలు నీ - తమ్ములమగు మేము । ఒమ్మికతో నుండ - సమ్మతించకచెడ్డ । రిమ్మెత్తి సైతాను-హుమ్మంచు లేచి భా । వమ్ములు జూచి బే-దమ్ములు సేయ సు। ఖ మ్ములు బాయ డెం - దమ్ములుదూయ శ। రమ్ముల నేయగా - యమ్ములతో

నిదిగో। నిమ్మళంబిక లేక - నిట్టూర్పువిడుచుచు। సొమ్మసిల్లి మేము - సోలుచునున్నాము । కమ్మని నీదయను - కనిపెట్టి యిదివేళ=రమ్మని మతిసుఖ-మిమ్మనివేడెదము ॥ మమ్ము జూడ నేడు॥

1. ఎక్కడిద్దరు ముగ్గురింపుగా - నున్న - నక్కడనీ వుందునంటివి = నిక్కంబుగా నీవే -దిక్కు మాక నినమ్మి। మక్కువతో చేరి - మన్నింపులను వేడి । మ్రొక్కులు చెల్లింప - మొనసినా మిచ్చోట। తక్కువగా నట్టి - పెక్కువిధములైన ।యిక్కట్లు మాకెన్నో - యెదురుగానున్నవి। మొక్కలమైన మా - మూర్ఖస్వభావము। రక్కసవలె లేచి - యొక్కొక్కతరిమమ్ము। చిక్కులబెట్టుచు -నెక్కువ బాధించు। నక్కటమాపై నీ - యక్కటకిపుదృష్టి = గ్రక్కునరానిచ్చి - గాచి రక్షింపుము ॥ మమ్ము జూడ నేడు॥

కం॥ ఏదైనను నీ నామము
తో దేవుని నడిగినపుడు - దొరుకుననుచు న
త్యాదరమున శిష్యులకు బ్ర
మోదంబున జెప్పినావు - మోక్షాధిపతీ.

## 9. కీర్తన

రా-శంకరాభరణము తా-అట

మోక్షాధికారీ -నీవే మాకు -రక్షించుదారి = అక్షీణమగు నీక-టాక్షంబుగోరి ని। రీక్షించుచున్నాము - సాక్షాత్కరింపవె ॥ మోక్షాధికారీ ॥

1. ఏ వస్తువైనన్ - పొందనుగోరి - భావంబులోనన్। నానామంబు - తో విశ్వాసమునన్। నాతండ్రి యె - హెూవానడిగినన్ = దీవించి మీకిచ్చు - దేవుండనుచు బల్కి। జీవవాక్యంబు నీ - శిష్యుల కొసగిన ॥మోక్షాధికారి॥

కం॥ ఐహిక సుఖములు గోరుచు
దేహ మెతాననుచు సుతస - తీ ధనబంధు
వ్యూహంబను ప్రకృతీ దుర్
మోహమహాంబుధిని నరులు - మునిగిరిదేవా

## 10. కీర్తన

"ఎవరు భాగ్యవంతులౌదు"వలె

రా–ధన్యాసి తా - ఆది

మునిగిరయ్యా నరులెల్ల దుర్ -మోహవార్ధిలో - వట్టి = పనికిమాలినట్టిదారి -బడి చెడిపోయిరయ్యయ్యయ్యో ॥మునిగిరయ్యా॥

1. ధనము ఎంచి ఘనము పెంచి - దారాపుత్రాదులను గాంచి = తనువేతానుగా భావించి - దర్పాంధము కన్నులకు మించి ॥ మునిగిరయ్యా॥

2. ఇహ సౌఖ్యములే యెంచి లోక - బహుమానములే మది నాశించి = యహమికా మమకారపాశము -లవయవములను గట్టికొనుచు ॥మునిగిరయ్యా॥

3. ఇరుగుపొరుగువారిలోన - ఇంటివారిలో కొందరు =మరణమవుట చూచి తమ్ము - చిరజీవులుగా తలచుకొంచు ॥ మునిగిరయ్యా॥

4. దేవదేవా యేసు నీవే - నావవై యీ కష్టాంబుదిలో = చావకుండ నీ సేవకుల - సంరక్షించినావు కృపను ॥మునిగిరయ్యా॥

కం॥ ఒకడైన యెహెూవా ర
క్షకుడై ప్రభుయేసు పేర - జనుందెంచెను భూ
మికిననెడు సత్యమున కొ
ప్పకపోయిరి నాడు నేడు - బహుజనులకటా

# 11. కీర్తన

రా -సావేరి తా -అట

బహుజనములకటా - సత్యమునకొ-వ్వకపోయిరెచట = మహిమోన్నతండైన - యెహెూవ క్రీస్తునిపేర । మహికి వచ్చుట నిజం - బని నమ్మగాలేక ॥బహుజనము॥

1. తొలికాలమందు - యెరూషలేము -పొలిమేరలందు । యూదులు ఫరిస-య్యులు ప్రభునియందు । దేవత్వచి -హ్నాలు మనసులందు = దలపోయ లేక ని-ష్ఫలులై దుర్గతిగూలి । రలనాడు నేడట్టి - ఖలులెందరో గలరు ॥ బహుజనము॥

2. దేవుడీయిలకు - రాకున్న న - రావళికొరకు । పాపము బోవు - త్రోవెట్లు గలుగు । సత్యత్రాణ -మేవిధము దొరుకు = జీవించు నరులు ని -ర్జీవులై చెడియుండ । గా వారిలో నెవడు - గతిజూపగా గలడు ॥బహుజనము॥

కం॥ ఓ యన్నలార మీమది<br>బాయని కినుకేల క్రీస్తు - పైకొండ పడం<br>ద్రోయను చీమలకు వశం<br>బే యడుగుల ముండ్లుదన్న - మేల్గలుగునొకో

# 12. కీర్తన

10. వలె

రా - ధన్యాసి తా - ఆది

ఓహెూ యన్నలార యీ దు - స్సాహసము మీ కేటికీ - దేహాత్మలను పుట్టించిన మీ - దేవుడగు ప్రభువు యేసునెడల ॥నోహెూ॥

1. అలుగనేల క్రీస్తుపై మీ - తెలివిలేని యాత్మలందు = బలమైనట్టి కొండందొలచి - పడద్రోయును చీమలకును వశమె ॥ఓహెూ॥

2. కండ్లగానకుండ చెడ్డ - కారు మాటలాడెదరు = ముండ్లను దన్నబోవునట్టి - మూర్ఖులకేమి మేలుగలదు ॥ఓహెూ॥

3. చెడ్డపాపాత్ముల నందరిని - శిక్షచేయుట ధర్మమైనను = దొడ్డ ప్రభువే యడ్డుపడి మీ - దురితంబులు పరిహరింప వచ్చె ॥ నోహెూ॥

కం॥ ఔపయికమునకు కృపకును
నేపారగ సంధిచేసి - యిచ్చెను ప్రాణం
బోపాపులార సత్య ద
యాపూర్ణుడు యేసుదేవు - డని గనుగొనరే

## 13. కీర్తన

"మహిమ మహిమ"వలె

రా-ఆనందభైరవి తా-అట

యేసు దేవుడని యెఱుంగరే -మనుజులార -మోసబుద్ధులను దొలంగరే = భాసురమగు దేవన్యాయ పద్ధతులను మీరునట్టి । దోసకారులకు విముక్తి - దొరుకుకొరకు ధరకువచ్చె ॥యేసు॥

1. న్యాయమునకు గృపకుపొందుగా - తగినసంధి -సేయ జగతి నెవడులేడు గా= శ్రేయాసాధికారిదానె - సిద్ధపడిన రాళికొరకు । నాయువొసగ నవతరించి - న్యాయమునకు తృప్తిజేసె ॥ యేసు॥

2. మనుజజాతి పాపములకునై - దాను శిక్ష -ననుభవించుటకు నరుండునై = తనువు బలియొనర్చి న్యాయ - మునకు తృప్తిజేసి కృపను । జనుల త్రాణకొస గెసత్య - ఘనదయాప్రపూర్ణుడతడు ॥యేసు॥

కం॥ కడుబీదయైన మరియా
కొడుకితడుగదా ప్రసిద్ధ - కుశలక్రియలె
క్కడనుండి గలిగెనని తడ
బడు యూదుల కందరాని - పరవస్త్వితడే

## 14. కీర్తన

రా-సావేరి తా-అట

పరవస్తువితడే - ప్రభువగుయేసు - పరవస్తువితడే = సోదరులారా - పరవస్తువితడే = మరియానందనుడని -నరమూర్తిగనుగొని। సరకుసేయనియూద - జనులకందగరాని ॥పరవస్తు॥

1. కడుబీదవాడు -అలమరియూ పు - త్రుడుగాడెవీడు ।మనలోన నొ-క్కడుగానున్నాడు । ఈ జ్ఞానమె -క్కడ బడసినాడు = కడుగ్రూరమతులు మూ-ర్ఖపుచిత్తుల్ ఫరిసయులు। నుడివిరారీతిబ -ల్కెడు వారికందని ॥పరవస్తు॥

2. నరదైవత్వములు- రెండును దాల్చి -పరమాద్భుతములు। పెక్కొనరించి - వరదృష్టాంతములు । నిండుగనున్న - పరతత్వార్థములు = నెరి శిష్యులకు బోధ - పరచివచ్చినపనిని। నెరవేర్చి మరణమై - తిరిగి లేచినయట్టి ॥పరవస్తు॥

3. క్షితిలోన నెవరు - ఈతని రీతి - క్రియచూపినారు। మరణమునొంది - బ్రతికినవారు। తొల్లియునేడు -వెతికినలేరు = ఇతడొక్కడే స్వేచ్ఛా - మృతుడై యామృతినణచి। బ్రతికి లేచి మహిమో -న్నతుడై ప్రకాశించె॥ పరవస్తు॥

కం॥ ఖరకరు వేడిమిసోకిన
సరసిజములభంగి సాధు - జనములెవని యా
త్మరహస్య దీప్తినొందిన
పరితోషితులగుదురట్టి - పరమాత్మితడే

## 15. కీర్తన

రా–దర్బారు తా–అట

పరమాత్ముడితడే – మన ప్రభుయేసు – పరమాత్ముడితడే = సోదరులారా – పరమాత్ముడితడే = పరమాత్ముడితడని – పరికించి మదిగాంచు । వరభక్తులకుక్షేమ – కరమానందముగల్గు ॥పరమాత్ము॥

1. జననమద్భుతము – ఈతడు సేయు – పనులద్యద్భుతముల్ – మృతిబొంది లే–చిన దెంతోఘనము ।నమ్మినవారి –కిని నిత్యసుఖము మనుజమాత్రుల కిట్టి – మహిమలుండునెయెందు । మనసాలోచనగల్గ – మతిమంతు లెద జూచు ॥పరమాత్ము॥

2. చదలమానికము – వేడిమి సోకి – జలజాతకులము । యుత్పుల్లసం – పదనొందువిధము । భక్తులలోని – ముదము ఈ విధము = సదయుడౌ ప్రభుయేసు – సాంగత్యమును జేయు । మృదుమానసులకెల్ల – హృదయానందమునిండు ॥పరమాత్ము॥

కం॥ గరువపునడతులుగల నర
గురువులు గురువులె విధేయ – గుణమణియగు సద్
గురుడొకడే క్రీస్తుడు దుర్
నరులకొరకు ప్రాణమొసగె – నరరూపుండై

## 16. కీర్తన

"పరిశుద్ధ పరిశుద్ధి"వలె

రా–శంకరాభరణము తా–అట

నరరూపుదాల్చెను – నజరీయుడగుయేసు । పరిశోధింతమురారె – ధరణిజనులారా = నిరుపమానందుండు – నిఖిలాంతరాత్ముండు । పరమపావనుడు స–ద్గురురాజేశ్వరుడీతడె ॥నరరూపు॥

1. నరులలో గర్వాంధ - నయనులౌ కొందరు। గురువులున్నను మంచి - గురుతేమి లేదు = నరజాతి ఘోర దు -స్తరపాపభారంబు । భరియించి రక్షించు - గురువేడి చూపుడి ॥నరరూపు॥

2. మనుజులందఱు పాప - మాలిన్యమునుబట్టి । రనుటకు సందేహమణువంతలేదు = కనుజూపులేనియం - ధునికి వేరొక గుడ్డి । మనుజుడేరీతి త్రో - వను జూపగా నేర్చు ॥నరరూపు॥

3. పాపంబులెడబావు - ప్రాయశ్చిత్తము చేయ । నోపుసత్పుణ్యాత్ము - డీపుడమిలేదు = శాపంబుచేనిరయ - కూపంబు జొరబోవు । పాపాత్ములను బ్రోవ - ప్రాణమొసగునెవడు । నరరూపు॥

కం॥ ఘనరసము ద్రాక్షరసముగ
నొనరించినయట్టి నీ మ - హోన్నతశక్తిన్
గనుగొనువారలకేటికి
ననుమానము నిన్ను దేవు-డని యనవలదే.

## 17. కీర్తన

రా-ఫరజు తా-అట

నిన్ను దేవుం-డనుట కొకసం - దేహమునులేదు = మన్నుపై బహుజనులకీమ -ర్మంబు దెలియదుగాని యేసు ॥నిన్ను దేవుం॥

1. జలమును ద్రాక్షారసంబుగ - తొలుతజేసెదు నీ మహాద్భుత। మెలమి జూచిరిగాని కనులకు - వెలుగులేదయ్యెన్ = వెలికి నీ నరరూపుమాత్రము - తెలిసికొనిరేగాని సద్భ । క్తులకు గన్పడు నీ మహామహి - మలుగనన్ పెరహారికబ్బునె ॥నిన్ను దేవుం॥

2. మరణమగు లాజరుని నీదగు - మాటతో జీవింపజేసెడి । వరమహాద్భుత మెల్లవారికి - దరిశనంబయ్యెన్ = పరమకారుణికోత్తమా గురు-వరా దేవుడవైననీడ। దురభిమానముగలుగు యూదుల - చరితమేమనవచ్చు సహహా ॥ నిన్ను దేవుం॥

3. వైరమున బహుజనులు గెత్సెమ - వములో నినుబట్టుకొనుటకు । జేరినప్పుడు వశముగాకను - క్షితిపయిన్ బడిరి = భూరిభవదీయ ప్రకాశత - వారి కన్నులు గప్పినప్పుడ । పారకరుణను నీకు నీవే - పట్టువడుటకు నిచ్చుకొంటివి ॥నిన్నుదేవుం॥

కం। చంచలమగు నిహసుఖములు
కొంచెము కాలంబునిలిచి - గొబ్బునబోవున్
మించిన ధనవంతుడు యా
చించెను లాజరుని నరక - చింతలవేళన్

## 18. కీర్తన

"రారె గొల్లవారలారా"వలె

రా-బేగడా తా-అట

చంచలమగు నిహసుఖమ్ములు - వట్టి - వంచునెంచిన వారెధన్యులు = ఎంచికూర్చినమంచి - యిహభాగ్యభోగాదు । లించుకసేపుండి - యేమిలేక నె బోవు ॥ చంచలమగు॥

1. సకలసందప లెన్నికూర్చిన - మృత్యు - వుకు నడ్డమేదైన నుండునా = ఒక ధనికుండు నా-రకవహ్నిబడి నీర। మొకబొట్టుబోసినా - లుక దడపమని వేడె ॥ చంచలమగు॥

2. ప్రభుయేసు నెవడు సేవించిన –లోక –విభవమించుకయ లేకుండిన = శుభవంతుడతడే స–త్సుఖమాత్మలో గల్గి । యుభయలోకములందు –నున్నతుడైయుండు ॥చంచలమగు॥

కం॥ ఛందస్సులు శాస్త్రంబులు
గందరగోళములు మనుజ – కల్పనలవి యె
ల్లందరమబడియె ప్రభు నీ
నుందర వాక్యములు మాకు – సుఖమిచ్చెగదా

## 19. కీర్తన

"అయ్యో మానవులార"వలె

రా– మోహన | తా–అట

సుఖమిచ్చెగద మాకు – ప్రభుయేసు నీ –సురుచిరమగు వాక్కు = నిఖిల కల్మషవనమునకు దవ – శిఖి శిఖలవలె గాల్చు నీదగు। ముఖవికాసిత వాక్యములు బహు – సుఖములొసగు తవాశ్రితాళికి ॥సుఖమిచ్చె॥

1. జగతి లోపల మెండుగ – నుండిన వివిధ – మగు శాస్త్రములు జూడగ = మిగుల గందరగోళమై మరి – యొకటి కొకటి విరుద్ధముగ మర్ । త్యగణ కల్పితమగుచు నున్నవి – తగనివని ద్రోచితిమి వాటిని ॥సుఖమిచ్చె॥

2. నీ వాక్యముల భావము – నమ్మిన పాపి – జీవులకది జీవము = కేవలంబగు ధర్మశాస్త్రము – దేవుడిచ్చినదొకటి బైబిలు। ఈ వసుధగల సర్వపాపుల – బ్రోవవచ్చిన నిన్ను జూపెను ॥సుఖమిచ్చె॥

కం॥ జంగమమలు స్థావరములు
నింగియు భూమియును మరియు - నిఖిల జగములున్
మంగళమగు క్రీస్తుకథల్
సంగీతము పాడవలయు -జయజయమనుచున్

## 20. కీర్తన

రా-ఆనందబైరవి తా-జుల్వా

జయమంగళము నిత్య - శుభ - మంగళం ॥ జయా॥

1. మంగళము క్రీస్తునకు - మరియాతనూజునకు । మంగళము దేవునికు - మారునకును = మంగళము మోక్ష సా - మ్రాజ్యాధికారునకు । మంగళము మా పాలి - మంచి ప్రభువునకెపుడు ॥జయ॥

2. నిరుపమాచారునకు - నిఖిలసంవేద్యునకు । పరిశుద్ధసద్గుణా - భరణునకును = కరుణా సముద్రునకు - పరమగురురాజునకు । స్మరియించి మేమెపుడు - మంగళము పాడెదము ॥జయ॥

3. సకలాంతరాత్మునకు - సచ్చిదానందునకు । నకళంకనరదైవ - మగువానికి = ప్రకటముగ మాకొరకు - ప్రాణమిచ్చినయేసు । నకు జయము జయమని - ఘనముగా పాడెదము ॥జయ॥

4. నింగియును భూమియును - నిఖిలలోకంబులును । జంగమస్థావరముల్ - స్వరములెత్తి = సంగీతవాద్యముల - జయజయధ్వనులతో । మంగళము పాడుడీ - మాయేసు రాజునకు ॥జయ॥

కం॥ ఝరములు నదులంబోనిధి
సరణింజని దానిజెందు - చందంబున నీ
చరణాంబుజసేవా త
త్పరులెల్లను నీస్వరూపు - దాల్తురుదేవా

## 21. కీర్తన

"యెహెూవా నీ మహిమాస్తవము'వలె

రా–శంకరాభరణము తా–అది

దేవా నీ స్వరూపు దాల్చు – దృడమైన నీ నిజభక్తులకు – జీవామృతము నీ వాక్యము గాదా = భావిత భవ్య సుఖామృతులై చిర– జీవముతో నీచెంత వసించెదు । నీ వారలలో నేనొకరుడగా – జీవించెద కృపచేయవెయేసు ॥దేవా॥

1. దరిలేని సంసారవార్ధి – తరియించుటకు నీ పాదములే – శరణమనుచు నినునమ్మినజనులు = ధరణిగల నిర్ఘరములు తమతమ – సరణినిజని సాగరమునబడి తత్ । స్వరూపమొందిన కరణిని నీలో – వరభక్తులు నీవలె దివినుందురు ॥ దేవా॥

2. మనుజాత్మల రక్షించుకొరకు – మరణమొంది తిరిగియు లేచి – మహిమతో పరమందున్నావిపుడు = ఒనరగ భువికిక నొకపరి వచ్చెద – నని బలికిన నీ యమూల్యవాక్యము । లను నమ్మికతో కనిపెట్టెడి నీ – జనులను రక్షింపను వెసరావె ॥దేవా॥

కం॥ టక్కరిఫరిసయ్యులు నిను
చిక్కులబెట్టందలంచి –సేయునదియులే
కొక్కుమ్మడి నినుజంపను
మిక్కిలి కోపమున శిలువ – వేసిరి యకటా

## 22. కీర్తన

"విజయంబు విజయంబు"వలె

రా–ముఖారి తా–అట

శిలువవేయబడిన – శ్రీ యేసు ప్రియమెంతో – తలపోయగదే చిత్తమా = కలుషాత్ములా ప్రభుని – కరపాదములలో మే। కులు గ్రుచ్చుతరివారి – కొరకు ప్రార్థించెను ॥శిలువవేయ॥

1. తులువలైన ఫరిస - య్యులు యూదులతనిపై - పులుల భంగిని జూచిరి = బలవన్మృత్యువు తనకు - దెలిసి దుష్టులవెంట । బలియర్పణకు గొర్రె -వలె మౌనమునబోయె ॥శిలువవేయు॥

2. ఆకాశమున దేవు-డవనిలో నరజాతి - ఈ కష్టములనిచ్చిరి = ఏకాకియై దిక్కు - లేక నీ రక్షకుడు । నీ కొరకు మృతిబొందె - నిజమిది నిజమిది ॥ శిలువవేయు॥

3. ఇనుడంధకారమ -య్యెను భూమివణికెనా - తనిపాట్లు గనువేళను = మనసుచెడ్డది దాని - పని మంచిపనిగాదు । నినుజూడబోక క్రీ -స్తుని ప్రేమగనిపెట్టు ॥శిలువవేయు॥

కం॥ రవరలగు యూదగణములు
భవజలధికి తరణివైన - ప్రభువానిన్న
త్యవివేకులగుచు జంపిరి
సవిశేష ప్రవచనములు - స్ఫుటమయ్యెగదా

## 23. కీర్తన

రా-శంకరాభరణము తా-అట

ప్రవచనములెల్లన్ - క్రీస్తుని మృతియం - దవి నెరవేరెన్ = భువియందు నావిభుం-డవతరింపకముందే । వివిధ కార్యములన్ని - వివరించి వ్రాసియున్న ॥ ప్రవచనము॥

1. ఆదియంత్యములు - లేనట్టి య - నాదిపురుషుండు । మేదినిలోని - యూదాదేశమున । బేత్లెహెమనెడి - యొక పట్టణమున = యూదులకు రాజుగా - నుద్భవించునటంచు । మోదంబునను మీఖ - ముని దెల్పెనదియయ్యె ॥ప్రవచనము॥

2. పగబట్టువారు - నిర్మూలముగ - తెగవ్రేయుకొరకు । నిష్కారణ - ముగలేచినారు । లెక్కకు చాల - మిగిలియున్నారు = తగనిట్లు తొల్లిచ -క్కగ

దెల్పె దావీదు । యొగినదియు నెరవేరె - యూదానివహము చేత ॥ప్రవచననము॥

3. దురహంకారమున - చుట్టుకొని యూ-దులు శిలువపైని -క్రీస్తుని వేసి। కరపాదములకు । మేకులు గ్రుచ్చి - బరిమార్చుటయును = మరిపక్కపోటును - సరిగా దావీదు జ । ఖరియా వ్రాసిరి తొల్లి - నెరవేరెనవియెల్ల ॥ప్రవచనము॥

కం॥ డంబాచారములకు వే
షంబూనక సాధుజనుల -సంగతియును స
త్యంబును విశ్వాసంబు తి
రంబునుగలవారె మంచి - క్రైస్తవులుభువిన్

## 24. కీర్తన

"వారు భాగ్యవంతులౌదురు"వలె

రా–ఆనందభైరవి తా–అట

వారె మంచి క్రైస్తవులుగదా - యీలోకమందు - వారె మంచి క్రైస్తవులుగదా = పారమార్థమైన క్రీస్తు -సారవాక్యమనుభవించు । వారి దారి గోరి జేరి - భూరిసుఖము బడయునట్టి ॥వారెమంచి॥

1. కపటవేషభాషలెల్లను - తొలంగద్రోచి - విపులభక్తి నిపుణులగుచును = లపితములు నసత్యములును - శపథములును లేక దేవ । కృపమనంబు లోనవెలిగి - యుపరిభాగమరయునట్టి ॥ వారెమంచి॥

2. నమ్మకంబు సుస్థిరంబుగా - మనంబులోన -సమ్మతంబుగలిగి మెండుగా = కమ్ముకొనెడి శ్రమలయందు -సొమ్మసిలక ప్రభునియడుగు । దమ్ములందు బుద్ధి నిలిపి - నెమ్మదిగలవారలెవరొ॥ వారె మంచి॥

కం ॥ ధంకావాద్యముతో ని
శ్శంకన్చాటెదను క్రీస్తు - సరిసద్గురు డే
వంకనులేడని శుద్ధా
లంకార జయోక్తులను ఇ - లాతలమందున్

## 25. కీర్తన

రా-బేగడా తా-అట

చాటెదను ఇలాతలమందున్ - నేటుగ క్రీస్తుడె గురుడెందున్ = మాటలు తేటలు - మర్మముగాదిది । కోటికోట్ల సద్గురు - గురుడీతడంచు ॥చాటెదను॥

1. పరిశుద్ధమతని భూషణము - దురాతాత్ములకది తోషణము = నిరయమునకు జను-నరజీవులదు । స్తరపాపహరము - కొరకుగాదె మరణమయ్యె ॥చాటెదను॥

2. బూటకమాత్మను బూనుకొని - కూటికిశిష్యుల గూర్చుకొని =మాటల మహిమలు - తేటపరుచునట్టి । తాటోటు గురువులిల - కీటకముల సాటియంచు॥చాటెదను॥

3. ధంకా వాద్యముతో నిలను -శంకింపకనే చాటెదను = సంకటపాప భ-యంకరపంకము । లింకను క్రీస్తుని - వంక జేరుడింకయంచు ॥చాటెదను॥

కం॥ తప్పులునంటనిశుద్ధుడు
తప్పులబడునరులగావ - తనయనువొసగెన్
తప్పొప్పుకొననివారల
తప్పక దండించు మనుజ - దైవంబితడే.

# 26. కీర్తన

22. వలె

రా -సెహన తా -అట

మనుజదైవంబీత -డని నమ్మువారికి - మనసు / నెమ్మది గల్గును = తనువందు గుణమందు - తప్పులేనివాడు । మనుజావతారుడై - మహికి వచ్చినాడు ॥ మనుజదైవం॥

1. దురితములంటని - గురుదేవుడగుయేసు - దురితజీవులకోసంము = పరిశుద్ధ కాయంబు-ప్రాయశ్చిత్తముజేసి । నెరివిశ్వాసులను మ-న్నించి రక్షించెను ॥ మనుజదైవం ॥

2. తప్పొప్పుకొనువారి - దయచేసి మన్నించి - మెప్పుగాకాపాడును = ఒప్పుకొననివారి - నొగిని అంత్యమునందు । తప్పక దండించు - తనతీర్పుదినమున ॥మనుజదైవం॥

కం॥ థోమాయను శిష్యుడొకడు
బూమెలుగా దలచెనీదు - పునరుత్థానం
బామోటుతనము మాన్పితి
వేమెయిగాయములు జూపి - విశ్వాధిపతీ.

# 27. కీర్తన

5. వలె

రా-శంకరాభరణము తా-అట

విశ్వాధిపతియేసు - యిటవచ్చి మా - విన్న పమాలించు - నశ్వరము లిహ సుఖములన్నియు - నవకుసుమసమమై వెసంజను । శాశ్వతానందంబుగల పర - సౌఖ్యములు మాకొసగిబ్రోవును ॥విశ్వాధిపతి॥

1. కనికరమునజూచి -మామదిలోని - యనుమానముల దృంచి = అనిశంబు నీ పాద - వనజంబులనుభక్తి। వినయంబుతో గొల్చు - పని మాకు నేర్పించి = అనుభవాంచిత శుద్ధవిశ్వా - స నిశితాయుధముల నొసగిమా। తను మనోవాక్యములు నిన్నే - యనుసరించుకొనంగజేయుము ॥విశ్వాధిపతి॥

2. మృతిబొంది తిరగి లేచి - నీ శిష్యులకి - చ్చితివి చక్కనిసాక్షి =మతి లోన నిన్ను న -మ్మని థోమాసునకు నీ। క్షతములుజూపించి -యతిపాతములు మాన్పి = ప్రతిహతాత్ములు గాక యెవరీ - క్షితినిజూడక నన్ను నమ్మిన। నతులితంబగు మోక్షభాగ్యో - న్నతులు వారలెయని బలికితివి ॥విశ్వాధిపతి॥

కం॥ దగగొను యూదులకు శిలా
నగముపగులజేసి నీళ్ల - నదినిచ్చినియా
భగవంతుడు దగగొని యొక
మగువను నీళ్లడిగె చిత్ర - మాప్రభునడతల్

## 28. కీర్తన

రా-ధన్యాసి తా -ఆది

చిత్రమాప్రభుని - చెన్నునడతలు - సేవకసుఖదములు = స్తోత్రార్హము క్రీ-స్తుని ఘనదివ్యచ ।రిత్రము పరమప - విత్రముపాత్రము ॥చిత్రమా॥

1. దూపరిగొను యూ - దులకొక బండను - యేపుగజలమొసగు = నాపరాత్పరుడు - దూపరిని సమే। ర్యాపొలతిని నీ-ళ్లడిగెను ద్రావను ॥చిత్రమా॥

2. సర్వోన్నత శా-శ్వతగృహములు తన - జనులకు దయనొసగు =సర్వేశ్వరుడు తల చాపుకొనను తన ।కుర్వియందు స్థల - మొక్కటి లేదనె ॥ చిత్రమా॥

3. బలుదూతలచే - కొలువంబడు పద-ములుగల దేవుడనా = ధులుహీనులు దీ-నులైన తన శి। ష్యుల పాదంబులు - చెలిమిని గడిగెను ॥చిత్రమా॥

కం॥ ధర్మముల చేతనఘములు
నిర్మూలము జేతుమనెడి - నిష్టలుగలయా
కర్మరులకు దొరుకునె నీ
యర్మిలికారుణ్య దృష్టి - యమృతములేకన్

## 29. కీర్తన

రా-శంకరాభరణము తా -అట

కారుణ్యమూర్తి -నీకృపలేక -గలుగునే ముక్తి = దారుణ దుర్విష -యోర గంబులచేత । గరవబడెడు నరుల - కేరీతిగతిగల్గు ॥కారుణ్య॥

1. ధరణియందున్న - ధర్మములన్ని - యెరిగిగైకొన్న । కర్మరులకు - బొరి జుట్టియున్న । యఘముల నొకటి - హరియింపదన్న = మరియానందన నీ నం -దరకటాక్షములపై । భరముంచబోనిదు -ర్నరుల కబ్బునెముక్తి ॥కారుణ్య॥

కం॥ నజరీయుడు మరియా గ
ర్భజుడల యోసేపు సుతుడు - మనుజుండని నీ
నిజమెఱుగక గొణిగిరి యూ
దజనులు ఫరిసయులు మూఢ - తములై యకటా

## 30. కీర్తన

17. వలె

రా-ఫరజు తా - ఆది

మూఢతములగు - వారికన్నులు - మూయబడెనకటా =రూఢిగా పరమాత్మచర్యలు -ఋజువుపరచిన తెలియజాలరు ॥మూఢతములగు॥

1. పుట్టుగుడ్డికి కన్నులిచ్చుట - బరిదురాత్మల బారదోలుట । రొట్టెలైదిట

నైదువేల్మ - ర్త్యులకు తిననిడుట = ఇట్టి ప్రభుకార్యములుజూచియు -నితడు కేవలనరుడుమరియా । పట్టియని యోసేపునుతుడని - ఫరిసయాదులు గొణిగి సణిగిరి ॥మూఢతములగు॥

2. కడలి పొంగడగించుటయు నె-క్కుడుతుఫానును నిలుపుటయు చచ్చెడి శవంబులోన జీవము - చేర్చి లేపుటయు = కడిదియద్భుతకార్యములు తమ - కనుల జూచియు జూడనట్లుగ । చెడుగుయూదులు ప్రభునియెడ స్మృతి-చెడి వృధా జల్పనములాడిరి ॥మూఢతములగు॥

కం॥ పరిశుద్ధము పరిశుద్ధము
పరిశుద్ధంబనుచు భక్త - వర్గముతో నీ
వరనామము నుతియింతుము
పరమార్థములొసగవే కృ-పా నిధి మాకున్

## 31. కీర్తన

4. వలె

రా-కాపి తా-జుల్వా

పరమార్థమొసగవె - ప్రభుయేసునాథా = కరుణింపుమయ్య భ -క్తజనాను మోదా ॥ పరమార్థ॥

1. పరిశుద్ధమనుచు ము -మ్మారు వచించి । వరదూతవ్రాతముల్ -శిరములు వంచి । నిరుపమస్తోత్రముల - నినుగొల్తురెపుడు = నరకీటకముల ప్రార్థ-నలు వినరమ్మిపుడు ॥పరమార్థ॥

2. క్షితిలో నీవేర్పరచు - జీవక్రైస్తవులు । యతులితానంద సు -ఖాత్మానుభవులు । సతతముమాకట్టి - సాధులపొందు =హితవుగనొనగూర్పు - మీ లోకమందు ॥పరమార్థ॥

కం॥ ఫలమియ్యని వ్రాకులగొ
డ్డలిచేతను దునిమివేయు-ట నిజంబాత్మన్
ఫలమెరుగని మిథ్యాక్త్రై
స్త్వులకాగతిగలుగుగాదె - తుదిదివసమునన్

## 32. కీర్తన

రా–ఫరజు తా –ఆది

తుదిదివసమురానున్నదిపాపుల - నదేగదా దుర్గతికీడ్చున్ = సదావిదారిత-హృదాంతరస్థనర ·। కదారుణాగ్ని క్రి -మిదుఃఖకరమగు ॥తుదిదివసము॥

1. ఫలమొసగని వ్రానులు నరకంబడి - జ్వలనజ్వాలలపాలగును = ఇలాతలిని క్రీ-స్తులోన ఫలరహి । తులైన నామధ-రులకందరికి యగు ॥తుదిదివసము॥

2. విగ్రహముల పెరవేల్పులగొలిచెడు -వివేకశూన్యులకాదినము = వ్యగ్రతనిత్యో -దగ్రసమగ్రమ । హోగ్ర నిరయవ - హ్నిగ్రస్తంబగు॥తుదిదివసము॥

3. ధనవంతులు ఘనకుల బలశాలులు - దరిద్రులిక నెవ్వరుగాని = ఒనరగ ప్రభుక్రీ -స్తుని మనమునన ।మ్మని జనముల కా-దినమతిభయమగు ॥తుదిదివసము॥

కం॥ బధిరులు వినగలిగిరి బహు
విధరోగులు బాగుపడిరి -మృతి బొందినవా
రు ధరించిరి జీవము నీ
యధికృతవాక్యమున నోద -యానిధియేసూ

## 33. కీర్తన

రా–కళ్యాణి తా–ఆది

దయానిధీ – దయయేదీ = ప్రయాసపడు మో – క్షయా త్రికులకా। త్మ యీావులొసగెడు – నియంత్రితుడవో ॥దయానిధీ॥

1. ధరిత్రిలో– నీ చరిత్రలో =పరోపకారివయి బ –ధిరాంధమూక వివి। ధరోగులను స్వ–స్థపరచినాడవు ॥ దయానిధీ॥

2. అనంతము –నీదుశాంతము =అనేకమగు వ్యధ –లనిచ్చు కుజనుల । దయన్క్షమించెడు – మనఃప్రకాశివి ॥దయానిధీ॥

3. పవిత్రము –నీదురక్తము =వివేకమున పా–పవహ్ని గన్గొనె।డువారి కదియమృ–తవారియట్లగు ॥దయానిధీ॥

కం॥ భవభయసాగరతరణీ
సవినయనిజభక్తహృదయ –సదనవిహారీ
సువిశేషసదాచారీ
ప్రవిమల సుగుణ ప్రకాశి–పాపవినాశీ

## 34. కీర్తన

రా–బేగడా తా–అట

పాపవినాశీ – సద్భక్తహృత్ –పద్మనివాసీ =ఆపన్న జనరక్ష –ణా పేక్షసు కటాక్ష। తాపత్రయోర్మిర – కూపారఘన తరణీ ॥పాపవినాశీ॥

1. మరియాతనూజ – మరియ స్త్రీ చి–కురపాదపూజ । ఆశ్రితలోక –వరకల్పభూజ ।నిత్యానంద – పరిపూర్ణతేజ = నిరుపమనిర్వ్రక – నిరవద్య కల్యాణ । పరిశుద్ధగుణజాల – కరుణాలవాలహె ॥పాపవినాశీ॥

కం॥ మన్నింపుము మాదోసము
లన్నియు నీరక్తధార - లాకీర్ణంబై
యున్నట్టు సిలువజూచెద
మన్నా మాహృదయదృష్టి - కదిముదమిచ్చున్

## 35. కీర్తన

"యేసునామముతో మధురము"వలె

రా-శంకరాభరణము తా - అట

మన్నింపుదేవా - మన్నింపు ప్రభువా =ఎన్నబడకున్న మా-యన్ని దోషములు ॥మన్నింపు॥

1. సిలువతట్టు -మాతలపుబెట్టు = ఎలమియున్ బలిమియున్ -ముక్తులుగజేసి ॥మన్నింపు॥

2. యుక్తమైన నీరక్తధారన్ = వ్యక్తపాపముల మము - ముక్తులుగజేసి ॥ మన్నింపు॥

3. శిరమునందు - నీ కరములందు =చరణములగారునె -త్తురు మాకు గన్పరచి ॥మన్నింపు॥

4. ముదములెదుగున్ - మాహృదయములను = సదయా నీసిలువద -ర్శనము మాకొసగి ॥మన్నింపు॥

కం॥ మమనియమాదులు సలపిన
భ్రమమతిదేశాంతరముల - పరుగెత్తుచు తీ
ర్థములాడిన పాపవినా
శముగల్గునె నీకృపాప్ర-సాదములేకున్

## 36. కీర్తన

రా–సెహన  తా–జుల్వా

పాపవినాశముగల్గునే - యేసు నీ పరమకృపలేకనే = శాపాత్ములై దైవ–కోపాగ్నికినిబోవు । కాపురుషులు ముక్తి–కేపాట్లుబడినను ॥పాపవినాశము॥

1. యమనియమాదులుసల్పిన - బుద్ధి–భ్రమను తీర్థములాడబోయిన = శ్రమచేత దేశాంత –రములన్నిదిరిగి జీ । వములేని ప్రతిమార్చ –నములెన్ని జేసిన ॥పాపవినాశము॥

2. క్రతుదానజపములొనర్చిన - మంత్ర - స్మృతి శాస్త్రములను పఠించిన= ఇతర ధర్మములింక యెన్ని జేసినగాని। మృతకర్మములుగాక - వృజినముల్ దెగవెందు ॥పాపవినాశనము॥

3. పరలోకమును దిగివచ్చుట - పాప - నరులరక్షింపను జచ్చుట - ఆరుదైన పనియిట్లు - నెరవేర్చితిని దీని - స్థిరముగనమ్మి నీ - సేవజేయక యున్న ॥పాపవినాశము॥

కం॥ రక్తము జిందకపాప వి
ముక్తముగాదనుచు శాస్త్ర - ముంద దెలిపె నఘా
సక్తులమగుమాకుభవ
ద్రక్తంబున పాపపరిహా - రముగలిగెగదా

## 37. కీర్తన

యేసును జూచుట యెన్నటికో

రా–ఫరజు  తా–ఆది

పాపపరిహారముగలిగెగదా - మా - పాలిటిరక్షణదొరికెగదా = పాపము

శాపము - తాపము బోవును । ఆ పరమగురుని - యదుగులుబట్టిన ॥పాపపరిహరము॥

1. నెత్తురుజిందక పాపంబు-తల-మొత్తబడదనెను శాస్త్రంబు = బత్తిని హత్తిన చిత్తముతో స । ర్వోత్తమ ప్రాయ -శ్చిత్తము గంటిమి ॥పాపపరిహరము॥

2. ఎంతచోద్యమీచరితంబు -మా-స్వాంతంబులకలతిహర్షంబు = కాంతమ చింత్యమ - నంతము క్రీస్తుని। శాంతిపుణ్యఫల - మంతయుమాదగు ॥పాపపరిహరము॥

3. కారణరహితకృపాదృష్టిన్ - మా -దారుణదురితము విడగొట్టెన్ = తోరము దారము - సారము ఘనగం । భీరము యేసుని -కారుణ్యంబది ॥పాపపరిహరము॥

4. ఉద్ధారకుడొకడే ఇలకు - తన - పద్ధతిలో జనువారలకు = బుద్ధిగ శుద్ధిగ - సిద్ధము జేయును। శుద్ధాత్మను క్రీ-స్తు కటాక్షించును ॥పాపపరిహరము॥

కం॥ లక్ష్యము నీ సిలువయు మా
భక్ష్యము నీ మధురజీవ - వాక్యంబులు నీ
రక్షితవిశ్వాసము మా
సాక్షిగ మదినున్న నితర - సాక్ష్యములేలా

## 38. కీర్తన

22. వలె

రా-సెహెన తా-అట

ఇతరుల సాక్ష్యము -ఎంతోగలిగియున్న -మతిసాక్ష్యమే -మంచిది =మృతిబొంది లేచి యు -న్నత మోక్ష రాజ్యాధి । పతియై యుండెడు యేసు - ప్రభువే మావిభుడైన ॥నితరుల॥

1. గురిసిలువదెసమాకు - స్థిరమై నిలిచియున్న - దురితము తలయెత్తునే = మరి యేసు ప్రక్కలో - చొరబారియందున్న। కరుణారసము గ్రోలు -టెటిగి

యుండినచాలు ॥నితరుల॥

2. తలవాల్చుటకు తనకు – స్థలములేదని బల్కు – పలుకే మాకైశ్వర్యము = బలమిచ్చి యెదిగించు – ప్రభువాగ్దత్తములే మా। కిలలో పంచభక్ష్య –ములుగా నుండినచాలు ॥నితరుల॥

3. బెదిరించి సైతాను – కదిలింపలేనట్టి – కుదురైన విశ్వాసము = బొదలుచు మాలో నిం–పొదువుచుండినచాలు । మదిలో నెమ్మదియిచ్చు – మా యేసు కృపగల్ల ॥నితరుల॥

కం॥ వరములు పెక్కున్నను న
శ్వరములని యెరింగి వాని – వాంఛింపరు నీ
వరభక్తులు నిన్నే తమ
చిరజీవంబనుచు సంత – సిల్లుదురుప్రభో

## 39. కీర్తన

22. వలె

రా–సావేరి తా–అట

చిరజీవముగు క్రీస్తు – చెలిమిగల్గెడివారు – వరము లెవ్వియుగోరరు = నిరుపమానదంబు – నిత్యాత్మజీవంబు । మరియానందను ప్రేమా – దరము మధురమదియె ॥చిరజీవముగు॥

1. వరములస్థిరమైన – వైభవంబులు గాని – పరిపూర్ణ సుఖమియ్యవు = నిరహేతువునుగల్గె – నిత్యానందసుఖంబు ।గురుదేవుడగు క్రీస్తు – కరుణలోనున్నది ॥చిరజీవమగు॥

2. అందరానటువంటి –యాశాఫలములెల్ల – పొందిన సుఖమేమిటీ = డెందముముదముప్ప – టికిమాత్రవేగాని । జెందవచ్చునె నిత్య – క్షేమానందసుఖంబు ॥చిరజీవమగు॥

3. కోరినవరములు -జేరవచ్చినగాని -కొరతయున్నదివాటికి = మేరలేనటువంటి - సారవాంఛితమొకటె।సారూప్యమది క్రీస్తు -సాన్నిధ్య మదిచాలు ॥చిరజీవమగు॥

కం॥ శక్త్యానుసారమున నీ
భక్తికి మనసిచ్చి పిదప - ప్రార్ధనతో నీ
శక్తి సహాయము గోరు న
శక్తున కదిబలమొసంగి - శాంతియొనర్చున్

## 40. కీర్తన

రా-శంకరాభరణము తా-అట

శాంతియొనర్చున్ - భక్తునిచిత్త - శాంతియొనర్చున్ । దేవుడుశక్తి -వింతగా నిచ్చున్ = సంతోషమునతమ - శక్తికొలది గాను । స్వాంతమొసగి భక్తి - సలిపెడువారలకు ॥శాంతియొనర్చున్॥

1. బలహీనభక్తి-తైలములేక - వెలిగించువత్తి। చందమున నే -దొలగు తత్కాంతి । యటులబుద్ధి - బలముసమాప్తి = తలపోసి తనయందు -గల న్యూనతలు గాంచి । యెలమిప్రార్ధనసేయ - నిచ్చు క్రీస్తుడుశక్తి ॥శాంతి॥

2. కన్నులవ్రెాల-లోక ముజూపుచున్నది లీల । సైతానేచి-యున్నాడుమూల। చెడుమతి వెదకు - చున్నది వేళ = యెన్ని శోధనలు చు-ట్టున్న వీ జీవునికి । తిన్నగా ప్రభుబ్రోవ -కున్న సుఖముగలదె ॥శాంతి॥

కం॥ షాడ్గుణ్యయుతాలౌకిక
షడ్గుణరహితామదీయ - జనితోన్మాదః
తృడ్గర్వమణప నీముఖ
ఖడ్గంబను వాక్యమిచ్చి - కరుణింపగదే.

## 41. కీర్తన

"విజయంబు విజయంబు"వలె

రా–ఆనందభైరవి తా–అట

కరుణింపగదె తండ్రి – పరమాత్మయేసుని –చరణమేగతి మాకు = దురిత పారావారమునబడి – దరియెఱుంగని నరవిసరముల। కరుణతో రక్షించుటకునిల – కరుగుదెంచిన దేవుడామము ॥కరుణింప॥

1. సర్వజ్ఞసర్వేశ – సర్వాంతర్యామియో – సర్వసృజనపాలకా = సర్వసంహరణత్వమనదగు – చారుషాడ్గుణ్యములుగల నీ। వుర్విలో నవతారమెత్తుట – కుచితమాయిది చోద్యమహహా ॥కరుణింప॥

2. ఇరుపార్శ్వములవాడి –. మెరయు నీవాక్యమను – కరవాలమొసగుమయ్యా = తరతరములగు మా దురేచ్ఛల – నరసివాటిని నరికివేయను। గురుతరంబగు నీ బలము మా –కరములకు నందీయవే ప్రభు ॥కరుణింప॥

కం॥ సర్వ ద్రష్టవు స్రష్టవు
సర్వాంతర్యామివగుచు – సర్వములోనన్
సర్వంబై వెలిగెడియో
సర్వేశ్వర యేసు మాకు – శరణము నీవే

## 42. కీర్తన

"మనసున నెమ్మది'వలె

రా–ఫరజు తా –ఆది

సర్వములో సర్వమునై వెలిగెడి – సర్వేశుడై మా ప్రభుయేసు = నిర్వాణపు సుఖ –నిలయముపండుగ। పర్వము మాకు స–మస్తంబతడే ॥సర్వములో॥

1. పుట్టింపను పోషింపను చంపను – మొట్టమొదలి దేవుండతడు = కట్టడలియ్యను – కరుణనుజూపను। స్పష్టమైన మా – సద్గురుడాతడె ॥సర్వములో॥

2. నరులకు దేవునికినిగల వైరము - పరిహరించుటకు ప్రతినిధిగా = నరులకు నరుడై - పరమేశ్వరునకు । పరమేశ్వరుడై - ప్రమోదమొసగెను ॥సర్వములో॥

3. అతనిచేతను భూతలినర సం-ఘాతములకు రక్షణగలిగెన్ = ప్రీతిని నమ్మిన -చేతనులకు నిర - హేతుకకృపచే - నిచ్చును మోక్షము ॥సర్వములో॥

కం॥ హంకారమమత్వములను
సంకటములు రెండుగూడి - జగమెల్ల నిరా
తంకముగ మ్రింగె తద్విజ
యాంకము మమ్మేలకుండ - నడ్డవె ప్రభువా

## 43. కీర్తన

రా-ఆనందభైరవి తా -అట

సంకటములు రెండులేచెను - భూలోకమెల్ల -సంక్రమించి మ్రింగివేసెను = హంకృతియు మమత్వమును ని-రంకుశముగ జోడుగూడి । సంకరముగ జగముజేసి -కింకరత్వమునకమర్చె ॥ సంకటములు॥

1. వానిబారిబడని మనుజుడు - యీ పుడమిలోన -గానరాడు మరియు పుట్టడు = మానసమున క్రొత్తజీవ -మూను క్రైస్తవులైన నా ప్ర। ధానరిపులతోడబోరి - గ్లానిబడుచునుందురకట ॥సంకటములు॥

2. గెలుపుగోరి పోరు భక్తులన్ - ఆ ప్రభువుజూచి - యెలమినిచ్చు తనదు సూక్తులన్ = పలు తెరగుల క్రిందుమీదు - బడుచునైన తుదనుయేసు । బలము కలిమివలన రిపుల బాసి ముక్తిబడయగలరు ॥ సంకటములు॥

3. దేవదేవ నీవు వాటిని - బ్రతుకంగనిచ్చి - నావు గనుక నిలిచె

జగతిని = భావశుద్ధిచేసి నీదు –భక్తులకు తదీయభయము । బోవునట్లొనర్చి మమ్ము – గావవేదయాపయోధి ॥సంకటములు॥

కం॥ క్షమమును దమమును కారు
ణ్యము విమల ప్రేమ సద్గు – ణాలంకృత దే
హము దాల్చియందు దైవ
త్వముగల ప్రభుయేసు నీకు – వందనమయ్యా

## 44. కీర్తన

రా–శంకరాభరణము తా–ఆట

వందనమయ్యా – యేసు నీకు – వందనమయ్యా । మాకోరిక – లందియ్యవయ్యా = వందనమయ్య నీ – సుందర పాదార । విందములకు భక్తి – వినతులు గావింతు = సందియంబులు లేని పరమా – నందమున నీయందు డెందుము । పొందు పడజేయవె యెహెూవా – నందనా పాపేంధనాగ్ని ॥వందనమయ్యా॥

1. నరదైవత్వములు – రెండునుగూడి – పరిపూర్ణమైన । దేహాత్మలు – ధరియించియందు । లేశంబయిన – దురితంబులేని । యవతారము – నెరవుగాదాల్పి = ధరణికి నేతెంచి – నిరయార్హులగుసర్వ ।నరుల రక్షింప నీ – కరుణాప్రవాహము = విరివిగా పరువెత్తజేయుచు – విమలమగు తను ప్రాణరక్తము । లరుదుగా నర్పణము చేసియు – తిరిగి లేచితివో మహాప్రభు ॥వందనమయ్యా॥

2. నీ పుణ్యమందు – నమ్మికొనెడి. – యేపాపియైన । తక్షణమున – శాపంబు బాసి । త్రాణగలిగి – నీపజ్జనుండు । కృప వానిని – కాపాడుచుండు =దీపించుభవదీయ – దివ్య వాగ్దత్తంబు। లాపత్పరంపరల – కడ్డుపడుచునుండు =నీపయిన్ తన భారమెల్లను – మోపియోపిక నుండ నేర్చిన। పాపి పుణ్యుండగుచు నాత్మను – భవ్య సుఖమఖిలంబుబడయును ॥వందనమయ్యా॥

3. శమదమప్రేమ – కృపావినయ – సద్గుణములనెడి । భూషణముల నిమిడియున్నట్టి । తనువుదాల్చిన – క్రమముగానందు । దైవత్వము

-కనుపరచినావు = విమలోపదేశముల్ - వివిధంబుగా శిష్య సముదయ మునకు ను -త్తముముగా బోధించి = యమితపాపహరంబునకు భువి - నవతరించిన మేను సిలువను। శ్రమనుమృతికర్పించి మృత్యువు -జంపి జీవించిన మహాత్మా ॥వందనమయ్యా॥

## స్తుతి కీర్తన

రా -సెహన తా-ఆది

వందనము యేసునకు -వరసుగుణాధారునకు - సౌందర్య ప్రభువునకు - సర్వే శ్వర నీకు ॥వందనము॥

1. యెహెూవా తనయునకు - ఇమ్మానుయేలునకు - బహుకరుణాభరణునకు - ప్రభువుల ప్రభునీకు ॥వందనము॥

2. ఆశ్రితజనపాలునకు - అకలుషనరదేహునకు - ఇశ్రాయేలు రాజునకు- యెహోవానీకు ॥వందనము॥

3. మరియూతనూజనకు - మహిమగంభీరునకు - పరిశుద్ధాచరణుకు - పరమేశ్వర నీకు ॥వందనము॥

4. రాజులపై రాజునకు - రవికోటి తేజునకు - పూజార్హపదాబ్జునకు - భువనావన నీకు ॥వందనము॥

5. కలుషములు హరించుటకు - శిలువనుమృతిబొందుటకు - ఇలనవతరించుటకు - నేతెంచిన నీకు ॥వందనము॥

6. విమలాత్మాపూర్ణునకు - వేదాంతాతీతునకు - మమకారవిరహితునకు - మా రక్షక నీకు ॥వందనము॥

7. ప్రేమదయాసింధునకు - క్షేమామృతపూర్ణునకు - ఆమెనని సాష్టాంగము - లర్పింతుము నీకు ॥వందనము॥

కంII పదునెనిమిది నూరులు డె
బ్బదినాల్గవయేడు కటక - పట్టణమున నీ
మృదుకందాలంకారము
లుదయించెను సాధు క్రైస్త - వోత్తములలరన్

## తోటకవృత్తములు

1 నలువదియొకసై - నృపటాలములో
సలిలిత క్రైస్తవ - సభ శుభకరమై
వెలిగెన్ యంతర - వేది సమాఖ్యన్
బొలుపుగ తత్ప్రియ - బోధకుడుండున్

2 అతని ప్రేమస - మాదరముల సం
ప్రీతుండై దత్ - ప్రేరేపణను ప్ర
ణీతంబయ్యెన్ - మృదుకందంబుల్
భూతలి చౌదరి - పురుషోత్తము చేన్.